## ప్రశ్న:

## "చర్చిని (సంఘమును) గూర్చి ప్రవక్తలేమన్నారు?"

## జవాబు:

తెలియబడగలిగినంత మట్టుకు, పాత నిబంధన ప్రవక్తలలో ఎవరూ కూడా "చర్చ్" అనే పదాన్ని ఉచ్చరించలేదు.[1] స్నానికుడైన యోహాను సహితము ఆ పదాన్ని ఉపయోగించలేదు, కాని యోహానును యితర ప్రవక్తలును సంఘాన్ని గూర్చి మాట్లాడారు. పాత నిబంధన ప్రవచనాల ద్వారాగాని, యోహాను దృష్టిలోగాని, అంతము క్రొత్త నిబంధన సంఘమే. అంగీకరించడానికి యిష్టపడినవారికి, క్రొత్త నిబంధన సంఘము – "అన్నిటికి కుదురుబాటు కాలము వచ్చునని దేవుడు ఆదినుండి తన పరిశుద్ధ ప్రవక్తల నోట పలికించెను" (అపో. 3:21) అనే స్థానాన్ని ఆక్రమించుకొంటుంది.

అపో. 3లో పేతురుచే పలుకబడిన, "పునరుద్ధరణ" ("కుదురుబాటు కాలము") బబులోను చెరానంతరం యూదులు తమ స్వదేశానికి తిరిగి పునరుద్ధరింపబడతారని చెప్పబడినది కాదు. ఆ పునరుద్ధరణ వారు చెరపట్టబడిన తరువాత డెబ్బై సంవత్సరాలకు నియమింపబడింది (యిర్మీయా 25:11), అది క్రీ.పూ 606–536లో నెరవేర్చబడింది (ఎజ్రా 1; 2 చూడు).

ఇంకా, కుదురుబాటు కాలముల ఆరంభంవరకు సంఘం కాలాన్ని ఆక్రమించు కొంటుందని పేతురు చెప్పడం లేదు. సంఘము (ఆయన రాజ్యము) తిరిగి తండ్రికి అప్పగించినప్పుడు (1 కొరింథి. 15:24), ఏ విధమైన పునరుద్ధరణ ఉండదు. దానికి బదులు, ఆకాశములు, భూమియు కాల్చబడినవై లయమై పోతాయి (2 పేతురు 3:10, 11; ప్రకటన 21:1), పునరుద్ధరించబడవు. సమస్తము "క్రొత్తవిగా" ఉంటాయి (ప్రకటన 21:5).

లేదు, కుదురుబాటు కాలాలు సంపూర్ణములయ్యేవరకు సంఘము కాలాన్ని ఆక్రమించుకొంటుంది, అంటే, క్రీ.శ. 30నుండి లోకాంతంవరకు. సంఘం ఆరంభింప బడినది మొదలుకొని పునరుద్ధరణ కొనసాగుతునే ఉంది, యిప్పుడు కూడా కొనసాగుతుంది, ప్రభువైనయేసు తిరిగి వచ్చేవరకు అది కొనసాగనైయుంది. (బాప్తిస్మమిచ్చు) యోహాను యొక్క పని పునరుద్ధరించడమే. ఏలీయా యొక్క ఆత్మయు (శక్తియు) గలవాడై, "అతడు తండ్రుల హృదయములను పిల్లల తట్టునకును, అవిధేయులను నీతిమంతుల జ్ఞానము ననుసరించుటకును త్రిప్పి" – అతడు సమస్త విషయాలను పునరుద్ధరించాడు (మత్తయి 17:11–13; లూకా 1:17). అలాగే తన సంఘముద్వారా ప్రభువైన యేసుయొక్క పని పునరుద్ధరించడమే – చీకటిలోనుండి వెలుగులోనికిని, సాతాను యొక్క అధికారమునుండి

దేవుని వైపుకును త్రిప్పడం (పునరుద్ధరించడం కాదా?) (అపొ. 26:18). “కుదురుబాటు కాలమని” పేతురు ప్రస్తావించింది, “ఆత్మసంబంధమైన పునరుద్ధరణ,” భౌతికమయ్యింది కాదు (అపొ. 3:21). అది సువార్త ప్రకటనవలన కలిగినది (రోమా 1:16), మరియు దానికి ప్రతిఫలమే “సంఘము” (చర్చ్) అని ఎరుక చేయబడిన – పిలువబడిన జనుల గుంపు. “కుదురుబాటు కాలము” పూర్తి అయ్యేవరకు పరలోకము ప్రభువైన యేసును అక్కడే నిలుపు కొంటుంది. నిజముగా, “సమూయేలు మొదలుకొని యెందరు ప్రవక్తలు ప్రవచించిరో వారందరు ఈ దినములను గూర్చి ప్రవచించిరి” (అపొ. 3:24). “ఈ దినములు” అనే ప్రయోగము, పేతురు క్రీ.శ 30లో ప్రకటింపగా, క్రీస్తు తిరిగి వచ్చిన తరువాత కాలాన్ని తప్పక సూచించదు, ఎందుకంటే, అప్పుడు దినాలనేవి యిక ఉండవు.

క్రీ.శ. 30లో పేతురుచే ప్రకటింపబడిన సంతోషకరమైన సందేశం ఏమంటే – క్రైస్తవులందరు “ప్రవక్తలకు కుమారులును, దేవుడు పితరులతో చేసిన నిబంధనకు వారసులై” యున్నారనునది. దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దాన మేమంటే, అతని సంతానమందు భూలోక వంశములన్నియు ఆశీర్వదింపబడును అనునది (అపొ. 3:25). అమోఘమైన (దేవుని) వాక్యమందు బలపరచబడే అనుభవము కలిగి, పేతురు ఏ మాటలమీద తన ప్రసంగాన్ని ఆధారం చేసికొన్నాడో ఆ ప్రవక్తల మాటలపై బలమైన విశ్వాసాన్ని కట్టుకోవాలి.

## ఆదికాండంలోని ప్రవచనాలు

### సువార్త యొక్క తొలి ప్రకటన

సువార్త యొక్క తొలి ప్రకటన ఏదెను తోటలో పలుకబడింది. ఆది. 3:15లో స్త్రీ సంతానమైన క్రీస్తు (మత్తయి 12:29లో), మరియు క్రైస్తవులు (రోమా 16:20) – సర్ప సంతానం, సాతాను మీద విజయవంతులై యుంటారని దేవుడు పలికాడు (హెబ్రీ. 2:14; 1 యోహాను 3:8). ఆది. 3:15లో పలుకబడిన నిరీక్షణ, శతాబ్దాల తరబడి అనేకులను ప్రోత్సహించింది.

### అబ్రాహాముకు వాగ్దానాలు

స్త్రీ యొక్క ఆత్మ సంబంధమైన సంతతి వారిలో (కయీనుద్వారా గాక, షేతుద్వారా), అబ్రాహామునందు దేవుడు తన నిత్య సంకల్పాన్ని వృద్ధిచేయ తగియున్నట్టు చూచాడు (ఆది. 12:1–3). నిజదేవునియందు అబ్రాహాము ఎలా విశ్వసించివచ్చాడో స్పష్టంగా తెలియదు. అతని తండ్రియైన తెరహు విగ్రహారాధకుడు (యెహోషువ 24:2). ఏది యెలాగున్నా, అతని తాతముత్తాతలలో షేము అనేవాడు అద్వితీయ సత్యదేవుని ఆరాధించేవాడు (ఆది. 9:26). అబ్రాహాము 150 సంవత్సరాల ప్రాయంవరకు షేము బ్రతికియే ఉన్నాడు, గనుక అబ్రాహాము హృదయంలో వ్యక్తిగతంగా అతడు విశ్వాసాన్ని ఉద్భవింపజేసి యుండవచ్చు. ఏవిధం చేతనైనా, అబ్రాహాము యొక్క భక్తి దేవుని యెడల ఎంత బలమైనదంటే దేవుడు అతనిని పరలోకంలో మాత్రమే సంపూర్ణము చేయబడు వాగ్దానములు ఉబికే కేంద్రముగా చేసాడు (మత్తయి 8:11). రమారమి 18 శతాబ్దాల

తరువాత, క్రీస్తుగా ఉండబోయే (గలతీ. 3:16) – అబ్రాహాము సంతతిద్వారా (ఆది. 22:18) – భూలోకంలో ఉన్న సమస్త కుటుంబాలన్నీ ఆశీర్వదింపబడతాయి (ఆది. 12:3). నేడు క్రీస్తులో ఉన్న యూదులు అన్యజనులు కూడా ఆత్మ సంబంధంగా అబ్రాహాము సంతానమై యుండి, వాగ్దానమునుబట్టి వారసులైయున్నారు (గలతీ. 3:29).

### యూదాకు వాగ్దానం

పరలోకము యొక్క సంకల్పానికి అనుకూలంగా, అబ్రాహాముకు ముదిమనుమలలో ఒకడైన యూదా, క్రీస్తుయొక్క పితరుడు అయ్యున్నాడు. ప్రవచనంలో, క్రీస్తు షిలోహు ("సమాధాన కర్త")గా, మరియు రాజుగా (రాజదండమును ఉపయోగించేవాడుగాను, చట్టాన్ని ఉచ్చరించే వాడుగాను) వర్ణింపబడ్డాడు: "షిలోహు వచ్చువరకు యూదా యొద్దనుండి దండము తొలగదు అతని కాళ్ల మధ్యనుండి రాజదండము తొలగదు ప్రజలు అతనికి విధేయులై యుందురు" (ఆది. 49:10). షిలోహుకు "విధేయులయ్యేవారు" ఎవరో కాదు–వారు ప్రభువైన యేసువలన పిలువబడినవారే (మత్తయి 16:18, 19).

## "సమూయేలు మొదలుకొని వచ్చినవారి" ప్రవచనములు

### సమూయేలుచే రికార్డు చేయబడిన ప్రవచనం

క్రొత్త నిబంధన సంఘము యొక్క "ఈ దినములను" గూర్చి ప్రవక్తలలో ఒకడుగా సమూయేలు ప్రవచించినట్లు, అపొ. 3:24లో పేతురు ప్రత్యేకంగా సూచించాడు. ఇల్లు, రాజ్యము అనే ఉదాహరణల క్రింద 2 సమూ. 7:16లో సంఘము కన్పిస్తుంది. రాబోయే ఈ యిల్లు నిశ్చయమే, మరియు దాని కాల పరిమాణము – నిత్యత్వం. ఈ ప్రవచనపు పూర్వ చరిత్రలో, సంఘమును క్రొత్త నిబంధన అటు యింటివారుగాను, యిటు రాజ్యంగాను ఉపయోగించడంలో ఆశ్చర్యమేమీ లేదు (1 తిమోతి 3:15; మత్తయి 16:19).

### దావీదు (పలికిన) ప్రవచనం

రాజుల వంశ పరంపరకు మూలకర్తగా సమూయేలు దావీదును అభిషేకించాడు. పిలువబడిన క్రొత్త నిబంధన జనులను గూర్చి ఒక ప్రత్యేకమైన విషయాన్ని ప్రవచించడానికి దేవుడు దావీదును ప్రవక్తగా చేశాడు (అపొ. 2:30). వారిని గూర్చి దావీదు యిలా అన్నాడు: "యుద్ధ సన్నాహదినమున నీ ప్రజలు ఇష్టపూర్వకముగా వచ్చెదరు. నీ యౌవనస్థులలో శ్రేష్ఠులు పరిశుద్ధాలంకృతులై. ... నీయొద్దకు వచ్చెదరు" (కీర్తన. 110:3). మారుమనస్సు నొందని జనములు, తీర్పు దినమున, మెస్సీయా ఉగ్రత అనే దండాన్ని అనుభవిస్తారు (కీర్తన. 2:9; ప్రకటన 19:15). తన సొంత జనము, పిలువబడిన గుంపు, పరిశుద్ధ జీవితమనే సౌందర్యముతో యిష్టపూర్వకంగా ఆయనను సేవిస్తారు.

### యెషయా ప్రవచనం

యెషయా ఇంతకు ముందున్న ప్రవక్తలకంటే మరింత స్పష్టముగా, ప్రభువు సంఘం స్థాపింపబడడానికి ఎనిమిది శతాబ్దాలు ముందుగానే దానిని చూడగలిగాడు. అతడు,

సమస్త జనములు దానిలోనికి వచ్చే, “యెహోవా మందిర పర్వతము” అని క్రొత్త నిబంధన సంఘమునకు పేరు పెట్టేలా అతనికి ఉత్తరువు జారీ చేయబడింది (యెషయా 2:2), మరలా, సంఘాన్ని పర్వతమనియు, (ఇల్లు) మందిరమనియు ప్రవచనపు భాషలో క్రొత్త నిబంధన లేఖకులు దానిని వర్ణించినట్లు మనం సహజంగానే కనుగొంటాం. హెబ్రీ. 12:22 యిలా అంటుంది, “ఇప్పుడైతే సియోనను కొండకును జీవముగల దేవుని పట్టణమునకును, అనగా పరలోకపు యెరూషలేమునకును ... వచ్చియున్నారు” (హెబ్రీ. 3:6 కూడా చూడు).

సంఘము యొక్క ప్రారంభ స్థలము యెరూషలేము అయ్యుంటుందని ముందుగా చెప్పడానికి యెషయా అధికారం పొందాడు (యెషయా 2:3). దానికి పరిపూర్ణమైన పొందికగా, తన నామమందు బోధింపనారంభించడానికి శక్తి పొందేవరకు యెరూష లేములో నిలిచియుండునట్లు ప్రభువైన యేసు తన అపొస్తలులకు ఉపదేశించి వెళ్లారు (లూకా 24:46–49). అలాగే, ఈ ప్రవచనానికి పొందికగా, ఆకాశము క్రిందనున్న ప్రతి జనములోనున్న ప్రజలు (అపొ. 2:5) సంఘ సభ్యులనుగా చేసే అపొస్తలుల సందేశాన్ని – ప్రభువైన క్రీస్తు సువార్తను విన్నారు (అపొ. 2:36). తత్ ఫలితంగా శరీరమనే సంఘములోనికి యించుమించు మూడువేలమంది బాప్తిస్మం పొందారు (అపొ. 2:41; 1 కొరింథీ. 12:13; కొలస్సీ. 1:18లను చూడు). ఆ సంఘ సభ్యులమీద “దావీదునకు చూపిన శాశ్వత కృప” కుమ్మరించబడింది (యెషయా 55:3). గొప్ప దీవెనలు వారికినీ, నేటి క్రైస్తవులందరికినీ చెందుతాయి. ఇట్టి దీవెనలను గూర్చి పూర్వకాలపు జనులు వినలేదు, లేక కంటితో చూడలేదు, కనీసం వారు ఊహించనూ లేదు (యెషయా 64:4; 1 కొరింథీ. 2:9 చూడు), అయితే అవి యిప్పుడు క్రైస్తవులకు వాస్తవమైయున్నాయి.

**యిర్మీయా ప్రవచనం**

మరో పటాన్ని ఉపయోగించుతూ, క్రొత్త నిబంధన సంఘం యొక్క ఈ “దినాలను” గూర్చి యిర్మీయా కూడా ప్రవచించాడు. పరిశుద్ధాత్మ అతనికి దైవ ప్రేరేపితమైన సాదృశ్యాన్ని యిచ్చాడు: భౌతికమైన ఇశ్రాయేలీయులు (ఇశ్రాయేలు+యూదాలు) ఐగుప్తునుండి వచ్చినప్పుడు దేవుడైన యెహోవా యొద్దనుండి ఒక నిబంధనను పొందారు. ఆ నిబంధన బాహ్యంగా రాతిపలకలమీదను, కాగితాలమీదను వ్రాయబడింది; అయితే ఆత్మసంబంధ మైన (ఇశ్రాయేలు + యూదాలు) ఇశ్రాయేలీయులు క్రొత్త నిబంధనను పొందుతారు. అవి అంతరంగంలో హృదయాలమీదను, మనస్సుల్లోను వ్రాయబడతాయి (యిర్మీయా 31:31–34; హెబ్రీ. 8:6–13 చూడు). దీనికి పరిపూర్ణమైన నెరవేర్పుగా, అపొస్తలులద్వారా హృదయములు అను పలకలమీద పరిశుద్ధాత్మ వ్రాసిన దానికి ప్రతిఫలంగా దేవుని సంఘము ఏర్పడింది. 2 కొరింథీ. 3:3లో పౌలు క్రైస్తవులకు యిలా తెలియజేశాడు, “రాతిపలకల మీదగాని సిరాతోగాని వ్రాయబడక, మెత్తని హృదయములు అను పలకలమీద జీవముగల దేవుని ఆత్మతో, మా పరిచర్య మూలముగా వ్రాయబడిన క్రీస్తు పత్రికయైయున్నారని మీరు తేటపరచబడుచున్నారు.”

**దానియేలు ప్రవచనం**

చెరవాసిగా ఉన్న దానియేలు సంఘము యొక్క స్థాపనకు ఆరు శతాబ్దాలగుండా చూచేలా దేవుడు అతనిని ప్రవక్తగా వాడుకున్నాడు. రోమా రాజులపై ప్రవచనపు దృష్టి నిలిపి, గొప్ప రాజ్యాలయొక్క ఔన్నత్య పతనాలను గూర్చి దానియేలు పలికాడు. ఆ రాజులు ఉన్నతమైన స్థితిలో ఉన్నప్పుడు, మర్త్యమైన చేతులతోగాక నిత్యత్వపు స్వభావంతో పరలోక మందున్న దేవుడు ఒక రాజ్యాన్ని స్థాపించునని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2:44; హెబ్రీ. 12:28), ఈ రాజ్య పౌరులతోనే క్రొత్త నిబంధన సంఘము నిర్మింపబడుతోంది (కొలస్సీ. 1:1, 2, 13).

**యోహాను ప్రవచనం**

క్రీ.శ. 30లో సంఘము యొక్క స్థాపనకు కొంచెం ముందుగా, దేవుడు యోహాను అనే ప్రవక్తను లేపాడు. అతని పని ప్రభువుకొరకు మనుష్యులను ఆయత్తము చేయడం (లూకా 1:17) – మారుమనస్సు పొందుడని వారిని పిలవడంద్వారా, వస్తున్న మెస్సీయాపై విశ్వాసముంచడం కొరకు, వారి పాపాలు తీసివేయబడడానికి నీళ్లలో ముంచడమియ్యడమై యుంది (మత్తయి 3:2; మార్కు 1:4). యోహాను దినములలో (సిద్ధపాటులో) సంఘము యొక్క ఉనికి యున్నట్టును, జనులు దానిలో ప్రవేశింప పోరాడుతున్నట్టును చెప్పవచ్చు (లూకా 16:16). అయినా, వాస్తవానికి, యోహాను దినాల్లో సంఘము ఉనికిలోనికి రాలేదు; తాను కూడా దానిలో సభ్యుడైయుండడానికి యోహాను నోచుకోలేదు (మత్తయి 11:11). దేవాలయం నిర్మించడంలో దావీదు సమకూర్చిన చెక్కుడు రాళ్లు, వగైరాలను తరువాత సొలొమోను ఉపయోగించుకున్నట్టే, యోహాను సిద్ధపరచిన ఆత్మసంబంధమైన రాళ్లను తన సంఘము అనే మందిరంలో క్రీస్తు ప్రభువు ఉంచారు.[2]

**కాలము పరిపూర్ణమయ్యింది**

యోహాను దినములవరకు ధర్మశాస్త్రమును, ప్రవక్తల వచనములును అమలులో ఉన్నాయి (మత్తయి 11:13), తరువాతనే యుగములకు సంబంధించిన ఆలోచన యొక్క నెరవేర్పు శిఖరాగ్రానికి చేరుకుంది – అంటే, దేవుని రాజ్యము, ఆయన గృహము, ఆయన పర్వతము, ఆయన ప్రజలు, ఆయన సంఘము స్థాపించబడింది! సమూయేలు మొదలుకొని మలాకీవరకు గల ప్రతి ప్రవక్త రాబోయే సంఘమును గూర్చి ప్రత్యేకించబడిన దృక్పథాన్ని కనుపరచినందున, పాత నిబంధననుబట్టి ఆశ్చర్యపోవడం యుక్తమే! ఆయన నిత్య సంకల్పాన్నిబట్టి (ఎఫెసీ. 3:11), "కాలము పరిపూర్ణమైనప్పుడు" (గలతీ. 4:4), నరమాత్రులలో ఎంతో గంభీరమైన దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము బయలుపరచ బడింది!

## ముగింపు

దేవుని మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పినవాడెవడు? (రోమా

11:34 చూడు.) మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తుద్వారానే, దేవునివారమై, దేవుని ద్వారానే, దేవుని నిమిత్తం ఉన్నాము!

---

సూచనలు

[1]*Church* అనే ఇంగ్లీషు పదం *Middle English chirche,* అనే దానినుండి వచ్చింది, యిది తిరిగి ప్రాచీన ఆంగ్ల భాషయైన *Kirche* అనే జర్మన్‌నుండి, అది మరల *cyriacon* అనే గ్రీకు పదంనుండి వచ్చింది. దానికి "సంబంధించిన" అని అర్థం. *Cyriacon* అనేది క్రొత్త నిబంధనలో రెండు సార్లు మాత్రమే కన్పిస్తుంది: మొదటిది, ప్రభురాత్రి భోజనానికి సంబంధించి (1 కొరింథీ. 11:20), మరియు రెండవది, ప్రభువు దినానికి సంబంధించి (పకటన 1:10). తరువాత అది దేవుని గృహానికి (మందిరానికి) సంబంధించి ఉపయోగించబడింది, గనుక "church" అనే ఇంగ్లీషు మాటకు "దేవుని యిల్లని" అర్థము. ప్రభువైన యేసు ఆ మాటను తన ప్రజలను వర్ణించడానికి ఉపయోగించారు. ఆ ప్రజలు ప్రవక్తల చేతను, యోహాను చేతను ముందుగా సూచింపబడ్డారు, వారు *ekklesia* అంటే – "బయటికి పిలువబడినవారు" అపవిత్రమైన వాటిలోనుండి ఆయన పిలుపు విని ప్రతి విషయములో ఆయన అధికారానికి తమ్మును తాము లోపరచుకొనడానికి వచ్చిన భూజనులందరు, ఆయన *ekklesia,* ఆయన యొక్క పిలువబడిన జనుల గుంపు, ఆయన సంఘము. [2]స్వయంగా యోహానుచే బాప్తిస్మం పొందినవారు తిరిగి బాప్తిస్మం పొందిన ఏ రికార్డూ లేదు. అలా అవసరమైయుంటే, దాని భావమేమంటే, తనకు నియమింపబడిన పనిని అతడు సరిగా జరిగించలేదని: ఆ పని ప్రభువుకొరకు ప్రజలను ఆయత్తం చేయడం (లూకా 1:17). అంతకుమించి, అది అవసరం అయ్యేకంటే, రెండవ సారి బాప్తిస్మమివ్వడంలో పెంతికొస్తు దినాన పేతురు తప్పక ఆ మార్గాన నడిపించేవాడే. ఇరవైనాల్గు సంవత్సరాల తరువాత, ఎఫెసులో ఎవరో ఒకరు (ఒకవేళ అపొల్లో కావచ్చు) రాబోయే మెస్సీయా సిలువ వేయబడతాడని, ఎదురు చూడబడిన యోహానుయొక్క వర్తమానాన్ని ప్రకటించిన మాట నిజమే, అతడు కనీసం పన్నెండుమంది పురుషులకు బాప్తిస్మమిచ్చాడు (అపొ. 19:1–4). ఇంతకు ముందే మెస్సీయా వచ్చి తమ కొరకు క్రీ.శ. 30లో చనిపోయాడన్న సంగతి ఎరుగక వారు క్రీ.శ. 54లో బాప్తిస్మం పొందారు. దానికి ఫలితంగా, వారు సత్యాన్ని (ఎరిగినప్పుడు) నేర్చుకున్నప్పుడు, వారు బాప్తిస్మం పొందవలసి వచ్చింది. క్రీ.శ. 30కి ముందు బాప్తిస్మం పొందిన వారెవరు తిరిగి బాప్తిస్మం పొందినట్టు ఏ రుజువూ లేదు.